సాక్షి
ఏలూరు

శనివారం । 10 । ఆగస్టు । 2024



గృహప్రవేశాలు ఎప్పుడు?

టిడ్కో లబ్ధిదారులతో శ్రావణ మాసంలో గృహప్రవేశాలు చేయిస్తామని ఎన్నికల ప్రచారంలో మంత్రి నిమ్మల హామీ ఇవ్వగా లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. 8లో ▸



అనుమానాస్పద మృతి

భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా వివాహిత తాగునీటి చెరువులో శవమై తేలిన ఘటన కలిదిండి మండలం సానారుద్రవరం కొత్త కాలనీలో చోటుచేసుకుంది. 8లో ▸



నిందితుడి అరెస్ట్

కొయ్యలగూడెం మండలం రామానుజపురంలో రాజనాల సాయిలక్ష్మి హత్యకు సంబంధించి ఆమె భర్త సూర్యచంద్రాన్ని పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో ▸

● అంబరాన్నంటిన ఆదివాసీ సంబరం



అడవిబిడ్డల సంబరాలు అంబరాన్నంటాయి. కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, గిరిజన మహిళల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివాసీ మహిళలతో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి నృత్యాలు చేస్తున్న దృశ్యం. ..8లో

● రాజ్యాంగ నిర్మాతకు క్షీరాభిషేకం



విజయవాడ స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతివనంలో విధ్వంసంపై జిల్లావ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ.. రాజ్యాంగ నిర్మాత విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. భీమవరం గునుపూడిలో క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం. ..8లో

న్యూస్‌రీల్

బాలసదనం పరిశీలన



బాలికలతో మాట్లాడుతున్న సంస్థ కార్యదర్శి

దెందులూరు: దెందులూరు ప్రభుత్వ బాలసదనాన్ని శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార చైర్మన్, జిల్లా జడ్జి సి.పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ పరిశీలించారు. బాలలకు అందిస్తున్న సేవలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహారం విషయంలో రాజీపడొద్దని, ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. బాలసదనం ఉద్యోగులు దుర్గామల్లేశ్వరి, చంద్రిక ఉన్నారు.

క్రీడా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన జిల్లాలోని ఐదు పాఠశాలలకు క్రీడా పురస్కారాలు అందించే నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 16లోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

1 నుంచి జాతీయ పశుగణన



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): దేశవ్యాప్తంగా వచ్చే నెల 1వ తేదీ నుంచి జరిగే 21వ జాతీయ పశుగణను జయప్రదం చేయాలని ఆ శాఖ సంచాలకుడు డాక్టర్ ఆర్.అమరేంద్ర పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31వరకు గణన ప్రక్రియ సాగుతుందన్నారు. రాష్ట్రంలో 6 వేల మంది ఎన్యుమేటర్లు గణనలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో 25 వేల మినీ గోకులాలు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. జేడీ జి.నెహ్రూబాబు, ఉప సంచాలకులు టి.గోవిందరాజు, కె.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి



పదోన్నతి పత్రాలు అందుకుంటున్న కార్యదర్శులు

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ సహాయకులకు పదోన్నతి అవకాశం కల్పించింది. జిల్లాలో 80 మంది గ్రేడ్–2 జూనియర్ సహాయకులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిబ్బందికి గ్రేడ్–2 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతికి అర్హత సాధించారు. అయితే వీరిలో 17 మంది వ్యక్తిగత కారణాలు వలన పదోన్నతి వదులుకోగా 63 మందికి కలెక్టర్ వెట్రి సెల్వి పదోన్నతి ఉత్తర్వులు జారీచేశారు. వీరంతా శుక్రవారం డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఉత్తర్వుల కాపీ తీసుకున్నారు.

అవయవ దానం.. ముగ్గురికి ప్రాణం



శ్రీనివాస్ (ఫైల్)

ఏలూరు(మెట్రో): ఏలూరుకు చెందిన వ్యాపారి టీఎస్‌వీఎల్ఎస్ శ్రీనివాస్ (57) మృతిచెందగా ఆయన శరీరంలోని అవయవాలను దానం చేయడంతో ముగ్గురికి పునర్జన్మను ప్రసాదించారు. శ్రీనివాస్‌కు తీవ్ర తలనొప్పి రాగా ఇటీవల సికింద్రాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఆయన బ్రెయిన్ డ్రెడ్‌కు గురయ్యారు. అవయవ దానంపై కిమ్స్ ఆస్పత్రిలోని సమన్వయకర్తలు మృతుడి కుటుంబ సభ్యులకు, బంధువులకు అవగాహన కల్పించారు. అనంతరం శ్రీనివాస్ భార్య, కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన కాలేయం, కిడ్నీలను దానం చేశారు. శ్రీనివాస్ చనిపోతూ కూడా మరో ముగ్గురికి ప్రాణదానం చేయడం తమకు గర్వంగా ఉందని మృతుడి భార్య, కుమార్తె అన్నారు. దానం చేసిన అవయవాలను జీవన్ ధాన్ ఆధ్వర్యంలో గ్రీన్ ఛానెల్ ద్వారా తరలించారని జీవన్ ధాన్ కమిటీ సభ్యులు తెలిపారు.

అన్నదాతల ఆక్రంధనం

ధాన్యం డబ్బులు ఎప్పుడిస్తావు బాబూ

కూటమి సర్కారు బకాయి

- ధాన్యం రైతుల గోడు పట్టించుకోని ప్రభుత్వం
- మూడు నెలలుగా బకాయిల కోసం ఎదురుచూపులు
- 'మీ కోసం'లో ఉన్నతాధికారులకు అర్జీలు
- ఏలూరు, పశ్చిమలో రూ.463 కోట్ల ధాన్యం బకాయిలు
- 23,116 మంది రైతుల అవస్థలు
- పంట పెట్టుబడులకు అప్పులు చేస్తున్న కర్షకులు
- గత ప్రభుత్వ హయాంలో 15 రోజుల్లోనే నగదు జమ



రైతును రాజు చేస్తాం.. ఏటా పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తాం.. రైతు సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం.. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఎవరికీ బకాయిలు ఉండకూడదు.. రెండు రోజుల్లో అన్నీ పూర్తి చేయాలి.. ఇవి పది రోజుల క్రితం అధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాటలు..

అయితే వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా సొమ్ములు అందకపోవడంతో అన్నదాతలు రోడ్లెక్కి ధర్నాలు చేస్తున్నారు. ధాన్యం బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో పంట పెట్టుబడులకు అప్పుల బాట పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 23,116 మంది రైతులకు రూ.463 కోట్ల ధాన్యం బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

ధాన్యం సొమ్ము బకాయిలు ఇలా..

పశ్చిమగోదావరి జిల్లా	ఏలూరు జిల్లా
బాధిత రైతులు సుమారు 21 వేలు	బాధిత రైతులు 2,116 వేలు
ధాన్యం బకాయిలు రూ. 416 కోట్లు	ధాన్యం బకాయిలు రూ. 47 కోట్లు

గత ప్రభుత్వంలో 21 రోజుల్లోనే జమ

గత జగన్ ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేది. ఏలూరు జిల్లాలో 350, పశ్చిమగోదావరి జిల్లాలో 284 రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసేవారు. ఈ ఏడాది కూడా రబీ సీజన్‌లో ధాన్యాన్ని సేకరించి ప్రారంభంలో సకాలంలో నగదు జమ చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో మే 10 తర్వాత కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు జరగలేదు. కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తామని ప్రకటించినా పట్టించుకోవడం లేదు.

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి జిల్లాలో అన్నదాతలను సర్కారు పట్టించుకోవడం లేదు. వందల కోట్ల రూపాయలు ధాన్యం సొమ్ములు చెల్లించాల్సి ఉన్నా ఉన్నతాధికారుల మొదలు మంత్రుల వరకూ ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతం కాగా.. ఖరీఫ్, రబీ సీజన్లు కలిపి సుమారు 7.50 లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తారు. ఇప్పటికే వరి ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు గడిచినా గత రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం సొమ్ములు రైతుల ఖాతాలో జమకాని పరిస్థితి. సార్వత్రిక ఎన్నికల కోడ్ సమయంలోనూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చేపట్టి కొంత మేర చెల్లింపులు కూడా పూర్తిచేసింది.

3.22 లక్షల ఎకరాల్లో సాగు

గత రబీ సీజన్‌లో పశ్చిమగోదావరి జిల్లాలో 2.40 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 88 వేల ఎకరాల్లో రైతులు వరి పండించారు. పశ్చిమలో 3.40 లక్షల టన్నులు, ఏలూరు జిల్లాలో 2.01 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. పశ్చిమలో 71 వేల మంది రైతుల నుంచి సుమారు రూ.1,400 కోట్ల విలువైన ధాన్యాన్ని గత ప్రభుత్వం సేకరించి ఎన్నికలకు ముందే 50,500 మంది రైతులకు రూ.984 కోట్లను చెల్లించింది. అలాగే ఏలూరు జిల్లాలో 17,454 మంది రైతుల నుంచి రూ.439.62 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించి రూ.392.62 కోట్లను రైతుల ఖాతాలకు జమచేసింది. ఇంకా పశ్చిమలో సుమారు 21 వేల మంది రైతులకు సుమారు రూ.416 కోట్లు, ఏలూరు జిల్లాలో 2,116 మంది రైతులకు సుమారు 47 కోట్ల వరకు ధాన్యం సొమ్ములు రావాల్సి ఉంది.

వ్యవ'సాయం' అందక.. అప్పుల తిప్పలు తప్పక..

రబీ ధాన్యం సొమ్ములు అందకపోవడంతో ఖరీఫ్ సాగు పనులకు రైతులు అప్పులబాట పడుతున్నారు. రెండు జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, ఆందోళనలు నిర్వహించారు. అలాగే ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే మీ కోసం కార్యక్రమంలో పదుల సంఖ్యలో వినతిపత్రాలు సమర్పించారు. అధికారులు అదిగో ఇదిగో అంటూ రెండు నెలలుగా మభ్యపెడుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్ పెట్టుబడులకు అప్పులు చేసిన రైతులకు గోదావరి వరదలు, ఎర్రకాల్వ, పెద్దవాగు ఉధృతితో పలు ప్రాంతాల్లో నారుమడులు మునిగిపోవడం మరింత ఇబ్బందిగా మారింది.

రూ.3.20 లక్షలు రావాలి



కొల్లేరు తీరంలోని సిద్ధాపురం గ్రామంలో ఎకరాన్నర సొంత భూమి, నాలుగున్నర ఎకరాల కౌలు భూమి సాగు చేస్తున్నా. రబీ ధాన్యాన్ని విక్రయించి మూడు నెలలవుతుంది. సుమారు రూ.3.20 లక్షలు జమ కాలేదు. అధికారులను అడిగితే రెండు రోజుల్లో అంటున్నారు. ఖరీఫ్ సాగు పెట్టుబడికి అప్పు చేశాను.

– తోట శివాజీ, రైతు, సిద్ధాపురం, ఆకివీడు మండలం

మే నెలలో ధాన్యం విక్రయించా..



ఐదు ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని ధాన్యం పండించా. గొల్లగూడెం రైతు భరోసా కేంద్రం ద్వారా 168 క్వింటాళ్ల ధాన్యాన్ని ఈ ఏడాది మే నెలలో విక్రయించాను. సుమారు రూ.3.60 లక్షలు రావాల్సి ఉంది. మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ జమ కాలేదు. ప్రస్తుత పంట పెట్టుబడికి డబ్బులు లేక అవస్థలు పడుతున్నాను.

– మాచర్ల శ్రీను, గొల్లగూడెం, ఉంగుటూరు మండలం

మూడు నెలలుగా అవస్థలు



ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపించి మూడు నెలలు అవుతుంది. ఇంకా డబ్బు జమ కాలేదు. ధాన్యం తరలింపునకు కిరాయి సైతం నేనే భరించా. చిన్న రైతుకు సైతం ధాన్యం సొమ్ములు జమకాకపోతే వ్యవసాయం ఎలా చేస్తాను. అప్పులు ఎలా తీరుస్తాను. ప్రభుత్వం పెట్టుబడి సాయం కూడా ఇప్పటికీ ఇవ్వలేదు.

– గోలి నర్సిరెడ్డి, రైతు, పేరంపేట, జంగారెడ్డిగూడెం మండలం

అప్పు కూడా పుట్టడం లేదు



ఖరీఫ్ సాగుకు అప్పు పుట్టడం లేదు. రబీ ధాన్యం డబ్బులు జమ కాలేదు. సాగుకు ఇచ్చే పెట్టుబడి సొమ్ము కూడా ప్రభుత్వం ఇవ్వలేదు. రైతు భరోసా ఇస్తారో లేదో తెలియదు. పాలకోడేరు మండలం మోగల్లు గ్రామంలో ఆరు ఎకరాలు కౌలు భూమి సాగు చేస్తున్నాను. కౌలు రుణాలు కూడా నేటికీ అందలేదు.

– మద్దుల జగన్‌మోహనరావు, కౌలు రైతు, మోగల్లు, పాలకోడేరు మండలం

గిరిజన చట్టాలను పరిరక్షించాలి

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



నందాపురంలో జరిగిన ఆదివాసీ దినోత్సవంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: గిరిజన చట్టాలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని నందాపురం వద్ద శుక్రవారం నిర్వహించిన ఆదివాసీ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివాసీ జెండాను ఎగురవేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతి, భాష, యాస, కట్టుబాట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆదివాసీ దినోత్సవానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చిందని, జగన్ గిరిజనుల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. గిరిజనులకు పోడు భూములకు పట్టాలివ్వడంతో పాటు రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయం అందించారన్నారు. సాధ్యం కాని హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, గిరిజన ప్రాంతంలో విద్య, వైద్యం అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్‌లు కుంజా వెంకటేశ్వరరావు, తెల్లం వెంకాయమ్మ, తెల్లం వెంకటలక్ష్మి, కుంజా దుర్గమ్మ, బన్నే బుచ్చిరాజు, పెడకం వెంకటలక్ష్మి, ఉయికే బొజ్జి, ఎంపీటీసీ గాలి దుర్గారావు, నాయకులు పొడియం లక్ష్మణరావు, కుంజా జగదీష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించడం దుర్మార్గం

మాజీ ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: విజయవాడ నడిబొడ్డున ఉన్న రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించడం దుర్మార్గం, దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గురువారం రాత్రి కొందరు పచ్చమూకలు విగ్రహం వద్ద నేమ్ బోర్డును ధ్వంసం చేయడం దారుణమన్నారు. సంఘటన స్థలంలో ఉండి కూడా పోలీసులు దానిని అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఏదో చేసేయాలని చూడటం పిరికిపందల చర్యని అన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన

వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం పట్ల పచ్చమూకలు ప్రవర్తించిన తీరు గర్హనీయమని అన్నారు. ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్ మాట్లాడుతూ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, మండల అధ్యక్షుడు పోలిమెట్ల శివ, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, నాయకులు కాలి సుగుణరావు, చేబత్తిన మున్నా, హరికోటి ప్రసాద్, తలారి సతీష్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలు

భీమవరం: సర్వోదయ మండలి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో విద్యార్థులకు పర్యావరణ–పరిరక్షణపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతల వివరాలను శుక్రవారం మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. సీనియర్స్ విభాగంగా కేఎస్ అమూల్య(వైఎస్‌పాలెం), వి.గీతిక (సత్రంపాడు), ఎంఎన్ఎస్ దీపిక(తిమ్మరాజుపాలెం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారన్నారు. జూనియర్స్ విభాగంలో జి.సాహితి (అత్తిలి), ఎస్.బ్రాహ్మణి(గోపాలపురం), ఎం.హిమశ్రీవర్ష (పాలకొల్లు), సబ్ జూనియర్స్ విభాగంలో కె.శ్రావణి (అజ్జరం), ఎం.కార్తికేయ (ఉల్లంపర్రు), బి.జోషిత సాయి (భీమవరం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందిస్తామని తెలిపారు.

పొరుగు జిల్లాల నుంచి ఇసుక పొందొచ్చు

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక రీచ్‌లు అందుబాటులో లేనందున పొరుగు జిల్లాల నుంచి ఇసుక పొందవచ్చని కలెక్టర్ నాగరాణి తెలిపారు. తూర్పుగోదావరి, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన నిర్వహణ చార్జీలు చెల్లించి ఇసుకను ఉచితంగా పొందవచ్చని పేర్కొన్నారు.

26న ఉద్యోగ దిక్సూచి

నరసాపురం/భీమవరం (ప్రకాశంచౌక్): నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో భాగంగా ఈనెల 26న ఉద్యోగ దిక్సూచి కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నరసాపురం వైఎన్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. పలు కంపెనీల్లో 420 ఉద్యోగాలను భర్తీ చేస్తామని, 10వ తరగతి నుంచి పీజీ వరకూ చదివిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 16–25 ఏళ్ల వయసున్న వారు అర్హులన్నారు. అభ్యర్థులు పశ్చిమ గోదావరి జిల్లా ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్ 9502024765, 7023896277 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై మండిపాటు

వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లుపై ముస్లింలు మండిపడుతున్నారు. వక్ఫ్ సవరణ చట్టం బిల్లుపై 21 మంది ఎంపీలతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటుచేయడాన్ని తప్పుపడుతున్నారు. ముస్లింలకు నష్టం కలిగించే ఈ బిల్లుకు టీడీపీ, జనసేన పార్టీలు మద్దతివ్వడం సరికాదంటున్నారు. వైఎస్సార్‌సీపీ, కేంద్రంలోని ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించడం హర్షణీయమని అంటున్నారు.

–భీమవరం (ప్రకాశంచౌక్)/తాడేపల్లిగూడెం టీఓసీ/నూజివీడు/చింతలపూడి/కైకలూరు

ఆమోదం దురదృష్టకరం



వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు తెలుగుదేశం కూటమి నేతలు ఆమోదం తెలపడం దురదృష్టకరం. మైనార్టీ సంఘాలన్నీ ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. మైనార్టీలపై కక్ష సాధింపుగా ఈ బిల్లును తీసుకువచ్చారు. బిల్లుకు మద్దతు పలికిన కూటమి ప్రభుత్వానికి మైనార్టీలు తగిన బుద్ధి చెబుతారు.

– కరిముల్లా బాషా, వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు

బిల్లును వెనక్కి తీసుకోవాలి



ముస్లింల హక్కులను కాలరాస్తూ స్వయం ప్రతిపత్తి కలిగిన వక్ఫ్ బోర్డు ఆస్తులను బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టేందుకు బిల్లు సవరణకు కేంద్ర ప్రభుత్వం చూడటం చాలా అన్యాయం. ఈ బిల్లు మత వ్యతిరేకమైంది. బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోంది.

– ఎస్‌కే నౌషాద్ మొహిద్దీన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి, తాడేపల్లిగూడెం

ఆస్తులపై పెత్తనం తగదు



వక్ఫ్ బోర్డు బిల్లు వల్ల ముస్లింల ఆస్తులపై పెత్తనం కేంద్రానికి పెరుగుతుంది. ఈ బిల్లుపై తెలుగుదేశం పార్టీ మద్దతు ప్రకటించడం మంచిది కాదు. సంస్కరణల పేరుతో వక్ఫ్ బోర్డుకు సవరణలు చేయడం వల్ల మా హక్కులకు భంగం కలుగుతుంది. సవరణలను ప్రభుత్వం విరమించుకోవాలి.

– షేక్ చాన్ బాషా, వక్ఫ్ బోర్డు సభ్యుడు, కలిదిండి

సవరణ అవసరమేముంది



వక్ఫ్ చట్టాన్ని సవరించాల్సిన అవసరమేముందో ముందుగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు సమాధానం చెప్పాలి. వక్ఫ్ చట్టంపై ముస్లింలకు అభ్యంతరం లేనప్పుడు దానిని సవరించాల్సిన పనేముంది. సవరణ అంశాన్ని ఉపసంహరించుకోవాలి.

– షేక్ మస్తాన్‌వలీ, నూజివీడు

వైఎస్సార్‌సీపీ అడ్డుకోవడం భేష్



రాజ్యాంగ స్ఫూర్తికి, లౌకిక వాదానికి వ్యతిరేకంగా ఉన్న వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో అడ్డుకోవడం ద్వారా తాము మత రాజకీయాలకు వ్యతిరేకమని వైఎస్సార్‌సీపీ మరోసారి స్పష్టం చేసింది. దీని ద్వారా మైనార్టీల ఆస్తులు, హక్కుల పరిరక్షణకు తాము కట్టుబడ్డామని జగన్ భరోసా ఇచ్చారు.

– షేక్ మస్తాన్, నూజివీడు

తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం



వక్ఫ్ చట్టంలో మార్పులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రత్యేకంగా చట్టాలు చేయడం సమంజసం కాదు. వక్ఫ్ బోర్డు ఆస్తులపై అధికారం కోసమే చట్టంలో మార్పులు చేస్తున్నారు. వెంటనే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలి.

– మహమ్మద్ ఇబ్రహీందౌలా (జిలానీ), చింతలపూడి

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం



కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కొయ్యలగూడెం: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఆర్ఐ మణిదివ్య శుక్రవారం తెలిపారు. కన్నాపురానికి చెందిన గ్రంధి శ్రీనివాస్ నివాసానికి సమీపంలోని గొడౌన్‌లో పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో 40 క్వింటాళ్ల అక్రమంగా నిల్వ చేసి ఉంచిన బియ్యం గుర్తించి కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన బియ్యం విలువ సుమారు రూ.1.60 లక్షలు ఉంటుందన్నారు.

శ్రీవారి సేవలో ఐజీ హరికృష్ణ



ఐజీ హరికృష్ణకు స్వామివారి మెమెంటో అందజేస్తున్న ఆలయ డీఈఓ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని డీజీపీ కార్యాలయ ఐజీ సిరివెళ్ల హరికృష్ణ శుక్రవారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు.

మంత్రి గారూ..
గృహప్రవేశాలు ఎప్పుడు?

- పాలకొల్లు టిడ్కో లబ్ధిదారుల ఎదురుచూపులు
- శ్రావణ మాసంలో గృహప్రవేశాలంటూ మంత్రి రామానాయుడు హామీ
- 2019లోనూ గృహప్రవేశాలంటూ నిమ్మల ఎన్నికల స్టంట్
- జగన్ పాలనలో 2560 మందికి టిడ్కో ఇళ్లు



పాలకొల్లులో ఇంకా ప్రారంభం కాని టిడ్కో ఇళ్లు

పాలకొల్లు సెంట్రల్: ×శ్రావణమాసం రాగానే టిడ్కో ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయిస్తాం×.. ఎన్నికల ప్రచారంలో మంత్రి నిమ్మల రామానాయుడు పాలకొల్లు ప్రజలకు ఇచ్చిన హామీ ఏప్రిల్ 6, 2024న స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లో టీడీపీ ఎన్నికల సభలో రామానాయుడే కాకుండా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కూడా టిడ్కో లబ్ధిదారులకు శ్రావణమాసంలో గృహప్రవేశాలు చేయిస్తామని ప్రకటించారు. శ్రావణమాసం వచ్చింది. మంత్రి ఇచ్చిన ఎన్నికల హామీని ఈ నెలలో ఎప్పుడు నెరవేరుస్తారా? అని లబ్ధిదారులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

2019లో పనులు పూర్తి కాకుండానే గృహప్రవేశాలు

2019 ఎన్నికల సమయంలో పెంకుళ్లపాడు టిడ్కో గృహాలు పనులు పూర్తికాకుండానే 2019 ఫిబ్రవరి 10న గృహప్రవేశాలు చేయించారు. అప్పుడు పత్రాలు ఇచ్చారు తప్ప ఎవ్వరికీ ఇళ్లు ఇవ్వలేదు. టిడ్కో గృహాలు టీడీపీ ప్రభుత్వంలో 90 శాతం పూర్తయ్యాయని మిగిలిన 10 శాతం పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేయలేకపోయిందని ఎన్నికల్లో ప్రచారం చేశారు. అధికారంలోకి రాగానే పది శాతం పనులు పూర్తి చేస్తామని ఇచ్చిన మాటను ఎప్పుడు నిలుపుకుంటారోనని నియోజకరవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు. 2019లోనే టిడ్కో గృహాలు 90 శాతం పనులు పూర్తిచేశాం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మిగిలిన 10 శాతం పనులు పూర్తిచేయలేకపోయిందనేది గత ఐదేళ్లుగా మంత్రి నిమ్మల వాదన. తాము అధికారంలోకి వస్తే శ్రావణమాసంలో లబ్ధిదారులందరికీ గృహప్రవేశాలు చేయించి పండుగ సమయంలో ఇంటిలోకి పంపిస్తామని చంద్రబాబు, రామానాయుడు హామీ ఇచ్చారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి నాడు పాలకొల్లు ఇన్‌చార్జిగా గుణ్ణం నాగబాబు ఉండగా పెంకుళ్లపాడు, రామయ్యహాలు, పెదగరువు ప్రాంతాల్లో సుమారు 70 ఎకరాల భూమిని కొనుగోలు చేయించారు. పెంకుళ్లపాడులో 50 ఎకరాల భూమిని కేటాయించారు.



ఇళ్లు ఇవ్వకపోయినా ఇంటి సంబరం అంటూ 2019లో ఆంధ్రజ్యోతిలో కథనం



అప్పుడు దీక్ష పేరిట డ్రామాలు.. ఇప్పుడు హామీ అమలేదీ?

జగన్ పాలనలో 80 బ్లాకుల పూర్తి

మొత్తం 6,144 మంది కోసం ఒక్కో బ్లాక్‌లో ఒక్కో ఫ్లోర్‌కు 8 పోర్షన్ల చొప్పున.. 4 ఫ్లోర్లకు 32 పోర్షన్లు నిర్మిస్తున్నారు. మొత్తం 192 బ్లాక్‌ల నిర్మాణం చేపట్టారు. శ్లాబ్‌ల పనులు మాత్రమే పూర్తికాగా, ప్లాట్లలో ఇంటీరియర్ పనులు జరగలేదు. 2019 ఎన్నికల సందర్భంగా టిడ్కో ఇళ్ల పంపిణీ చేస్తున్నట్టు పట్టాలు అందించి గృహ ప్రవేశాల పేరిట హడావిడి చేశారు. ఒక్క లబ్ధిదారుడికి అవి నివాస యోగ్యంగా లేవు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 80 బ్లాకుల్లో ఇంటీరియర్ పనులు పూర్తిచేసి 2,560 మంది లబ్ధిదారులకు గృహాలు ఇవ్వగా వారంతా ఆ ఇళ్లలో ఉంటున్నారు. 112 బ్లాక్‌ల పనులు పూర్తికావాల్సి ఉంది. ఇంతవరకూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 41.5 శాతం టిడ్కో గృహాల పనులు పూర్తయ్యాయి. శ్రావణ మాసంలోనే ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చిన నేతలు ఇప్పుడు ఏం చేస్తారనేది వేచిచూడాలి.

2,560 మందికి ప్లాట్లు ఇచ్చాం

టిడ్కో గృహాల్లో ప్రస్తుతం 80 బ్లాక్‌లు పూర్తయ్యాయి. వాటిలో 2,560 మంది లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చాం. ఇంకా 112 బ్లాక్‌ల పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం పెయింటింగ్ పనులు, ప్లంబింగ్ పనులు చేస్తున్నారు. సుమారు 75 నుంచి 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు జరుగుతున్నాయి.

– మణికంఠ, టిడ్కో ఏఈ, పాలకొల్లు

ఎన్నిసార్లు గృహ ప్రవేశాలు?



2019లో గృహప్రవేశాలు చేయించి పత్రాలు ఇచ్చారు తప్ప ఒక్కరికీ ఇల్లు ఇవ్వలేదు. 2024 ఎన్నికలు వచ్చేసరికి శ్రావణమాసంలో గృహప్రవేశాలు చేయిస్తామని నమ్మించి మళ్లీ లబ్ధి పొందారు. ఒక ఇంటికి ఎన్ని సార్లు గృహప్రవేశాలు చేస్తారు. వైఎస్సార్‌సిపి ప్రభుత్వంలో 80 బ్లాక్‌ల్లో 41.5 శాతం పనులు చేశాం. 2560 మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అందజేశాం. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టుగా ఆ మిగిలిన 10 శాతం టిడ్కో పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు శ్రావణమాసం ముగిసే లోపు అందించాలి.

– గుడాల గోపి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, పాలకొల్లు నియోజకవర్గం

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



అదుపులోకి తీసుకున్న నిందితుడితో పోలీసు అధికారులు

కొయ్యలగూడెం: రామానుజపురంలో మహిళ హత్యకు సంబంధించి ఆమె భర్త సూర్యచంద్రంను అరెస్టు చేసినట్లు చేసినట్లు ఎస్ఐ జీజే విష్ణువర్ధన్ శుక్రవారం తెలిపారు. ఈనెల ఏడో తేదీ రామానుజపురంలో రాజనాల సాయిలక్ష్మీని భర్త సూర్యచంద్రం హత్య చేశాడని.. భార్యతో వేధింపులు, గొడవలు పడలేక హత్యకు పాల్పడినట్లు సూర్యచంద్రం పేర్కొన్నాడన్నారు. హత్య చేసిన అనంతరం పరారీలో ఉండగా ఉదయం రామానుజపురం నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళ్తుండగా నరసన్నపాలెం వద్ద అరెస్టు చేశామని తెలిపారు. హతురాలి తల్లి మోటేపల్లి నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

వివాహిత అనుమానాస్పద మృతి



కలిదిండి మండలం సానారుద్రవరం గ్రామంలో మృతిపై దర్యాప్తు చేస్తున్న సీఐ, ఎస్ఐలు

కైకలూరు: భార్యభర్తల మధ్య విభేదాల కారణంగా వివాహిత తాగునీటి చెరువులో శవమై తేలిన ఘటన కలిదిండి మండలం సానారుద్రవరం కొత్త కాలనీలో శుక్రవారం జరిగింది. పోలీసులు, మృతురాలి తల్లి తెలిపిన వివరాలు ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం గుమ్ములూరుకు చెందిన ఏడుకొండలు, శివ ఆదిలక్ష్మీల కుమార్తె అనంతలక్ష్మీ(33)కి కలిదిండి మండలం సానారుద్రవరానికి చెందిన పుప్పాల నాగరాజు(37)తో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పాప(12), బాబు(10) ఉన్నారు. నాగరాజు వ్యసనాలకు బానిసై భార్యను వేధిస్తున్నాడు. వేధింపులు భరించలేక రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. రెండేళ్లుగా పుట్టింట్లో ఉంటుంది. మూడు నెలల క్రితం నాగరాజు ఇబ్బంది పెట్టనని నచ్చచెప్పి సానారుద్రవరానికి భార్యను తీసుకొచ్చాడు. గురువారం రాత్రి 9 గంటలకు మృతురాలు ఫోన్ చేసి భర్త మద్యం తాగి గొడవ చేస్తున్నాడని తల్లికి చెప్పింది. ఉదయం 4 గంటలకు కూతురు చనిపోయిందని భర్త తరుపున బంధువులు ఫోన్ చేసి చెప్పారు. అనంతలక్ష్మి ముఖంపై దెబ్బలు తగిలిన గుర్తులు ఉన్నాయి. భర్త కొట్టి తాగునీటి చెరువులో ఊపిరాడనియ్యకుండా చేసి హత్య చేశాడని బంధువులు ఆరోపిస్తున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

దోషులను తక్షణం అరెస్టు చేయాలి

ఎస్సీ కమిషన్ సభ్యుడు ఆనందప్రకాష్



చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: విజయవాడ స్మృతివనంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడానికి కుట్రపన్నిన దోషులను తక్షణం అరెస్ట్ చేసి చట్టపరంగా శిక్షించాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ డిమాండ్ చేశారు. పాలకొల్లు సమీపంలోని యాళ్లవానిగరువులో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విజయవాడ పోలీస్ కమిషనర్‌ను తక్షణం విధుల నుంచి తప్పించాలని కోరారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడి రాజ్యాంగంపై జరిగిన దాడిగా దేశం యావత్తూ అభిప్రాయపడుతుందన్నారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: కొల్లేరు మొండికోడులో చేపలు పట్టేందుకు వెళ్ళిన వ్యక్తి నీటిలో మునిగి మృతిచెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు మరడాని రంగారావు కాలనీకి చెందిన డి.గురవయ్య (38) మొండికోడులో గాలం వేసి చేపలు పట్టేందుకు వెళ్లాడు. మొండికోడులో గుర్రపుడెక్క అధికంగా ఉండడంతో అంచనా వేయలేక దానిలో అడుగు వేయగానే ఊబిలో చిక్కుకుపోయాడు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆళ్ల నాని రాజీనామా

సాక్షి ప్రతినిధి, ఏలూరు: మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని శుక్రవారం పార్టీ పదవికి రాజీనామా చేశారు. జిల్లా అధ్యక్ష బాధ్యతలతో పాటు ఏలూరు అసెంబ్లీ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి వైదొలగుతున్నట్టు ఆయన కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. వ్యక్తిగత కారణాలతో ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు లేఖలో పేర్కొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం



చింతలపూడిలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కంభం విజయరాజు



తాడేపల్లిగూడెంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

చింతలపూడి: విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు తెలిపారు. చింతలపూడి పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి విజయరాజుతోపాటు ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్, మండల అధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్, పట్టణ కన్వీనర్ కొప్పుల నాగు, పలువురు దళిత నాయకులు క్షీరాభిషేకం చేసి పూలదండలతో నివాళులర్పించారు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్‌లో దోషులను శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకంపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరును ధ్వంసం చేయడం తీవ్రమైన నేరంగా భావించాలన్నారు. ప్రభుత్వం తక్షణం దుండగులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వర్రావు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్.భరత్‌రెడ్డి , రేచర్ల సర్పంచ్ శివరామకృష్ణ, గణిజర్ల సర్పంచ్ ఎ.వెంకట్రావు, చుండూరి నాగేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, ఎస్.దుర్గారావు, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, పెనుగొండ శివ, మోహన్‌రావు, ఎస్సీ సెల్ నాయకులు ఎస్ కాంతారావు, కె.వెంకటేశ్వర్రావు, దారా పేర్రాజు, గోపి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

తాడేపల్లిగూడెం అర్బన్: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషమని వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. తాలూకా ఆఫీసు సెంటరు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని పక్కనపెట్టి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేయడంతోపాటు రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌ను అవమానించడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బోణం విజయనిర్మల, బొద్దాని శ్రీనివాస్, రాపాక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో గిరిపుత్రులకు ఉజ్వల భవిష్యత్తు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

బుట్టాయగూడెం: విద్య ద్వారానే గిరిపుత్రుల భవిష్యత్తు మారుతుందని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. మండలంలోని కోటరామచంద్రాపురం ఐటీడీఏ పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి ఉన్నత విద్య లక్ష్యంగా ఐఏఎస్ సాధించానని తెలిపారు. విద్య ప్రాముఖ్యతను గుర్తించి తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహించాలన్నారు. గిరిజనుల సమస్యల కోసం మండలాల్లోనే ప్రతి నెల 1న ప్రత్యేకంగా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. గిరిజనులు భూ సమస్యలు, రైతులు, వివిధ సమస్యలు తెలుసుకునేందుకు వివిధ శాఖలకు చెందిన అధికారులందరూ మీ వద్దకే వస్తారని వాటి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఐటీడీఏ పీఓ జి.శ్రీనుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు



కొమ్ము, డోలు వాద్యాలతో నృత్యాలు చేస్తున్న గిరిజనులు

బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద శుక్రవారం ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థుల నృత్యరూపకం గిరిజనుల సంప్రదాయాల్ని కళ్లకు కట్టింది. అలాగే గిరిజన మహిళలు నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. వివిధ రకాల స్టాల్స్‌తో ఐటీడీఏ పరేడ్ గ్రౌండ్స్‌లో సందడి నెలకొంది. –బుట్టాయగూడెం



కల్లు తాగే నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు



గిరిజన సంప్రదాయ నృత్యం




బుట్టాయగూడెం మండలం ఐటీడీఏ వద్ద గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థులు



ఆకట్టుకున్న చిన్నారులు

సైబర్ నేరస్తుడి అరెస్ట్



ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ స్టేషన్‌లో పోలీసుల అదుపులో సైబర్ నేరస్తుడు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ పరిధి రూరల్ స్టేషన్‌లో సైబర్ నేరస్తుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోషల్‌మీడియాలో ఫొటోలు డౌన్‌లోడ్ చేసి మార్ఫింగ్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్న వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు మండలం చాటపర్రుకు చెందిన యువతి సోషల్‌మీడియాలో ప్రొఫైల్ ఫొటో పెట్టుకోగా గుర్తు తెలియని వ్యక్తి ఫొటోలను డౌన్‌లోడ్ చేసుకుని, న్యూడ్ మార్ఫింగ్ చేసి వాటిని తిరిగి ఆమెకు పంపించాడు. డబ్బులు ఇవ్వాలని లేదంటే సోషల్‌మీడియాలో పెడతానంటూ వేధింపులకు దిగాడు. రూరల్ ఎస్సై కె.రాజారెడ్డి కేసు నమోదు చేయగా.. సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. జిల్లా సైబర్ క్రైమ్ సెల్ సహకారంతో నెల్లూరు జిల్లా సంగం మండలం బెండదిబ్బకు చెందిన షేక్ షకీర్‌ను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. షకీర్ సుమారు 20 మంది మహిళలకు సంబంధించిన ఫొటోలను వాట్సప్ ప్రొఫైల్ నుంచి డౌన్‌లోడ్ చేసి మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేసినట్లు విచారణలో తెలిసిందని తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరిగితే వెంటనే సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీఐ తెలిపారు.